సాక్షి కామారెడ్డి

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



'పది'కి సర్వం సిద్ధం

ఎస్సెస్సీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. 11,899 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

- 8లో ▸



విజయానికి నాంది

బిచ్కుంద మండలంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే సింధే పాల్గొన్నారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
39.8 /18.6

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఇఫ్తార్ ఆది : 6:35 | సహర్ సోమ : 4:48

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

కామారెడ్డి క్రైం: జిల్లాలో నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌శాఖ అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఉచిత బియ్యం 6 కిలోలు

5వ తేదీ నుంచి పంపిణీ ప్రారంభం

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా ఈ నెలలో ఒక్కో యూనిట్‌కు 6 కిలోల చొప్పున ఉచిత బియ్యం అందించనున్నారు. ఆహార భద్రత కార్డుదారులకు ఒక్కో యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఉచితంగా అందిస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. 5వ తేదీనుంచి పంపిణీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆహార భద్రత కార్డుదారులకు మూడు నెలలుగా ఒక్కో యూనిట్‌కు 5 కిలోల చొప్పున మాత్రమే బియ్యం అందిస్తున్న విషయం తెలిసిందే. ఈనెలలో ఆరు కిలోల చొప్పున ఇవ్వనున్నారు.

చట్టాలపై అవగాహన

కామారెడ్డి క్రైం: జిల్లా కోర్టులో శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి నెల మొదటి శనివారం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నామని కోర్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో పోలీసుశాఖకు చెందిన విచారణ అధికారులకు (ఐఓ) చట్టాలపై అవగాహన కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్ శివరాం నాయక్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నిమ్మ దామోదర్‌రెడ్డి, కామారెడ్డి డీఎస్పీ సురేష్, కామారెడ్డి సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు, కోర్టు లైజనింగ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'మహిళా సంక్షేమం బీజేపీతోనే సాధ్యం'



కామారెడ్డి టౌన్: మహిళా సంక్షేమం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మహిళా మోర్చా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నళిని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ మహిళా మోర్చా రెండు రోజుల ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా ఆమె శనివారం కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం జిల్లా కేంద్రంలోని దళిత వాడలో బీజేపీ మహిళా నాయకురాలు యాదమ్మ ఇంటిలో అల్పాహారం చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా మోర్చా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలపై పోరాడాలన్నారు. రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వస్తేనే అవినీతి రహిత పాలన అందుతుందని, మహిళలకు రక్షణ లభిస్తుందని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో ఈనెల 3వ తేదీనుంచి ప్రారంభం కావాల్సిన బీఈడీ మొదటి సెమిస్టర్ థియరీ పరీక్షలను అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని బీఈడీ విద్యార్థులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయం గమనించాలని సూచించారు. తిరిగి పరీక్షలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.inను సంప్రదించాలని సూచించారు.



నిజాంసాగర్ మండలం మాగిలో తలపడుతున్న మల్లయోధులు(ఫైల్)

- పండుగలు, ఉత్సవాల సందర్భంగా పోటీలు
- పోటాపోటీగా తలపడుతున్న మల్లయోధులు
- మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి రాక
- ఏడాదికేడాది జనంలో పెరుగుతున్న ఆసక్తి



పిట్లంలో కుస్తీ పోటీలను తిలకిస్తున్న ప్రజలు

కుస్తీమే సవాల్!



పిట్లం: పల్లవిని అభినందిస్తున్న నిర్వాహకులు

సండే స్పెషల్

తనను మట్టి కరిపించడానికి కండ బలంతో దూసుకొస్తున్న మరో యోధుడి కదలికలను పసిగట్టి, ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ, ఒడుపుగా పట్టి దెబ్బతీయడమే కుస్తీ. బహుమతి కోసం కాకుండా విజయానందం కోసం మల్లయోధులు చేసే యుద్ధమిది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలలో పండుగలు, జాతరల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లావాసులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటకల మల్లయోధులూ పాల్గొంటారు. మల్లయుద్ధాన్ని తిలకించడానికి జనం సైతం భారీగా తరలివస్తుండడంతో పోటీలకు ఏటా ఆదరణ పెరుగుతూనే ఉంది. కుస్తీ పోటీలపై సండే స్పెషల్..

సాక్షి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మంజీర నది వెంట ఉన్న గ్రామాల్లో కుస్తీ పోటీలకు విశేష ఆదరణ ఉంది. నిజాంసాగర్, పిట్లం, బిచ్కుంద, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, కోటగిరి, చందూర్, బోధన్, వర్ని మండలాలతో పాటు జుక్కల్, ఎడపల్లి, పెద్దకొడప్‌గల్, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో పోటీలు ఎక్కువగా జరుగుతుంటాయి. విజేతలుగా నిలిచిన వారికి నిర్వాహకులు వెండి కడియాలు, నగదు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు.

దశాబ్దాలుగా..

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో తరతరాలుగా కుస్తీపోటీలు జరుగుతున్నాయి. కొన్ని చోట్ల తాతలు, తర్వాత తండ్రులు, ఇప్పుడు వారి కొడుకులు పోటీల్లో పాల్గొంటూ వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. తమది మల్లయోధుల కుటుంబం అంటూ గొప్పగా చెప్పుకునేవారెందరో ఉన్నారు. ఉమ్మడి జిల్లావాసులే కాకుండా పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా మల్లయోధులు వచ్చి పోటీలలో పాల్గొంటున్నారు. వేలాది మంది జనం హాజరై ఈలలు కొడుతూ ఉత్సాహ పరుస్తుండడంతో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శ్రీరామనవమి సందర్భంగా శనివారం పిట్లం మండల కేంద్రంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో పెద్ద సంఖ్యలో మల్లయోధులు పాల్గొన్నారు. పోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చారు. గాంధారి మండలం గౌరారంలో కూడా శనివారం కుస్తీ పోటీలు జరిగాయి. మల్లయోధులు పాల్గొని తమ సత్తా చాటారు.

పండుగల్లో ప్రత్యేకం...

ఉమ్మడి జిల్లాలో పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శివరాత్రి, హోలీ, ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, దసరా, దీపావళి తదితర పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. అలాగే ఆయా ప్రాంతాల్లో అల్లమ ప్రభు జాతర, భేతాళ జయంతి, మత్తడి పోచమ్మ, ప్రభుస్వామి, పెద్దమ్మ, దుర్గమ్మ ఉత్సవాలలో మల్లయుద్ధాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. పట్టణాలు, నగరాలకు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన వారు పండుగలకు సొంతూళ్లకు వచ్చి నాలుగైదు రోజులు ఉంటారు. ఈ సందర్భంగా కుస్తీ పోటీలు తిలకించడానికి ఒక్కచోటకు చేరతారు.



పిట్లంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

మగవాళ్లతో పోటీపడి..

దంగల్ సినిమాలో నటించిన మహారాష్ట్రలోని విదర్భ జిల్లా పుస్సద్‌కు చెందిన యువతి పల్లవి శనివారం పిట్లం మండల కేంద్రంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొంది. ఇద్దరు మల్లయోధులను ఓడించి విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడ పోటీలు జరిగినా హాజరవుతానని పేర్కొంది.



యువకుడితో తలపడుతున్న పల్లవి

నాన్నను చూసి నేర్చుకున్న



మా నాన్న గబ్బర్‌సింగ్ మంచి మల్లయోధుడు. ఎన్నో ప్రాంతాల్లో పోటీపడి విజయాలు సాధించారు. ఆయనను చూసి కుస్తీ నేర్చుకున్న. పండుగల సమయంలో చుట్టుపక్కల గ్రామాలలో పోటీలు జరుగుతాయి. వాటిలో పాల్గొని సత్తా చాటుతున్నా.

– కోల శివాజీ, కాయితీతండా, గాంధారి మండలం

ఐదేళ్లుగా పాల్గొంటున్నా..



నాకు కుస్తీ పోటీల మీద ఎంతో ఆసక్తి ఉంది. దీంతో కుస్తీ నేర్చుకున్నా. ఐదేళ్లుగా పోటీలలో పాల్గొంటున్నా. ఎన్నో పోటీలలో పాల్గొని వెండి కడియాలు, ప్రైజ్‌మనీ, కప్పులు అందుకున్నాను. ఇలాగే ఆడుతూ ఉంటా.

– దొబ్బల శ్రీకాంత్, భవానీపేట, లింగంపేట మండలం

మా చిన్నాయిన ప్రోత్సాహంతో...



మా చిన్నాయిన రాములు నాకు చిన్నప్పటి నుంచి కుస్తీల గురించి చెప్పేవాడు. కుస్తీ పోటీలు జరిగే ఊళ్లకు తీసుకువెళ్లి మరీ నేర్పించాడు. పది పదిహేనేళ్లుగా నేనూ కుస్తీ పోటీలకు హాజరవుతున్నాను. నేను నేర్చుకున్న విద్యను నలుగురికి నేర్పిస్తున్నాను.

–మహేందర్, నస్రుల్లాబాద్

ఎక్కడ పోటీలు ఉన్నా వెళ్తుంటా...



నాకు కుస్తీ అంటే ఇష్టం. మా ఊరిలోనే కాకుండా చుట్టుపక్కల ఊళ్లల్లో ఎక్కడ కుస్తీ పోటీలు పెట్టారని తెలిసినా అక్కడికి వెళ్లి పాల్గొంటాను. ప్రతి ఏడాది పండుగల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహిస్తుంటారు. ఆయా పోటీల్లో పాల్గొని సత్తా చాటుతుంటా.

–నరేశ్, రుద్రారం, ఎల్లారెడ్డి మండలం

పదిహేనేళ్లుగా...



మాది మహారాష్ట్రలోని నాందేడ్. నేను పదిహేనేళ్లుగా కుస్తీ పోటీలకు హాజరవుతున్నాను. ఎక్కడ పోటీలు జరిగినా వెళ్లి పాల్గొంటున్నాను. నాకు కుస్తీ పోటీలంటే ఎంతో ఇష్టం. మరికొన్ని సంవత్సరాలు కుస్తీ పడతా.

–యుగేశ్, నాందేడ్, మహారాష్ట్ర

నాలుగైదు రాష్ట్రాలు వెళ్తా..



ఏ ఆటలోనైనా గెలుపు ఓటములు సహజం. గెలవాలన్న పట్టుదలతోనే ఆడతాం. కుస్తీ అంటే ఇష్టంతో పదేళ్లుగా పోటీల్లో పాల్గొంటున్నా. నాలుగైదు రాష్ట్రాలలో కుస్తీ పోటీలలో పాల్గొన్నాను. ఎన్నో బహుమతులు గెలిచాను.

–గొల్లు, హర్యానా

ఎన్నడూ ఓడిపోలే..



చిన్నప్పుడు మహారాష్ట్రకు వెళ్లి కుస్తీ నేర్చుకున్నా. కుస్తీ పోటీలకు సైకిళ్ల మీద వెళ్లి కుస్తీలు పట్టేది. నేను ఎప్పుడూ ఓడిపోలేదు. తర్వాత ముప్పై మందికి కుస్తీ నేర్పించిన. ఇప్పటికీ యువకులకు కుస్తీ నైపుణ్యాలు చెబుతున్నా.

– ఎరుకలి రాములు, నస్రుల్లాబాద్

శ్రీరాముడి జీవితం ఆదర్శం



స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కంకణం కట్టి ఆశీర్వదిస్తున్న దుర్గాప్రసాద్ స్వామీజీ

- స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: శ్రీరాముడి జీవితం సమాజానికి ఆదర్శమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాన్సువాడలోని సరస్వతి ఆలయం వద్ద హనుమాన్ దీక్షాధారులు మహా మండల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రామాయణం, మహాభారతం, భగవద్గీతలాంటి గ్రంథాలు, కథలు మానవుడికి ఎంతో జ్ఞానాన్ని ఇస్తాయన్నారు. బాన్సువాడ భక్తి వాడగా పేరుగాంచుతోందని పేర్కొన్నారు. బాన్సువాడలో హనుమాన్ దీక్షాధారుల సన్నిధానం నిర్మాణం కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇందూరుకు చెందిన సురేష్, శారద్ సారదా బ్రదర్స్ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో గాయత్రి ఆశ్రమ పీఠాధిపతి సుదర్శన దండి కాశి స్వామీజీ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు పోచారం శంభురెడ్డి, అంజిరెడ్డి, పాత బాలు, లింగం, నాగభూషణం, సాయాగౌడ్, రాజు, దత్తు, కొండ మురళి, ఉమ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తిరుమలకు 66 ఎకరాలు..

నస్రుల్లాబాద్: బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి ప్రభుత్వం 66 ఎకరాల భూమిని కేటాయిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి భూమి పత్రాలను దేవాదాయ శాఖ అధికారులకు అందించారు. ఆలయానికి భూమి కేటాయించినందుకు స్పీకర్ పోచారం సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీవో రాజాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భూమి పత్రాలను అందిస్తున్న స్పీకర్ పోచారం

గొర్రెల పంపిణీకి సిద్ధం కండి

- లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహించండి
- వీసీలో పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు, అధికారులు

కామారెడ్డి క్రైం: రాష్ట్రంలో రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి కలెక్టర్లు సన్నద్ధం కావాలని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గొర్రెల యూనిట్ వ్యయాన్ని ప్రభుత్వం రూ.1.25 లక్షల నుంచి రూ.1.75 లక్షలకు పెంచిందన్నారు. ఇందులో 25 శాతం అంటే రూ. 43,750 లబ్ధిదారుడు వాటా చెల్లిస్తే మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం సబ్సిడీ విడుదల చేస్తుందన్నారు. లబ్ధిదారులతో అవగాహన సమావేశాలు నిర్వహించి, వాటా ధనాన్ని సేకరించాలని కలెక్టర్లకు సూచించారు. గొర్రెల కొనుగోలుకు సంబంధించి సమీపంలో ఉన్న మార్కెట్‌లను మ్యాపింగ్ చేశామన్నారు. ప్రతి జిల్లా నుంచి సీనియర్ స్థాయి అధికారిని నియమించి గొర్రెలను కొనుగోలు చేయాలన్నారు. గొర్రెల రవాణా కోసం వెంటనే టెండర్లు నిర్వహించాలని సూచించారు.

కంటి వెలుగును పర్యవేక్షించండి

కంటి వెలుగు అంశంపై సీఎస్ శాంతికుమారి సమీక్షించారు. కంటి వెలుగును పర్యవేక్షించాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాలకు చేరిన ప్రిస్కిప్షన్ కళ్లద్దాలను త్వరితగతిన లబ్ధిదారులకు వారి ఇంటి వద్ద అందించే విషయమై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమంపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వు 58కి సంబంధించి పెండింగ్ పట్టాల పంపిణీని వారం లోగా పూర్తి చేయాలన్నారు. జీవో 58, 59 కింద దరఖాస్తు చేసుకునేందుకు నెలాఖరు వరకు గడువు ఉందన్నారు. 15వ తేదీ నాటికి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు వెంకటేష్ ధోత్రే, చంద్రమోహన్, ఆర్డీవోలు శ్రీనివాసరెడ్డి, శ్రీను, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి భరత్, మున్సిపల్ కమిషనర్లు దేవేందర్, రమేష్ కుమార్, జగ్జీవన్, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రూర్బన్ పనుల వేగం పెంచాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

నిజాంసాగర్: వెనకబడిన ప్రాంతాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూర్బన్ పథకం పనులను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. శనివారం జుక్కల్ మండలంలోని మహ్మదాబాద్, పడంపల్లి, జుక్కల్ గ్రామాల్లో రూర్బన్ పనులను ఆయన పరిశీలించారు. పందిరి సాగు, బస్‌షెల్టర్, మినీస్టేడియం నిర్మాణ పనుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రూర్బన్ పథకం కింద గుర్తించిన పనులన్నింటినీ నాలుగైదు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జుక్కల్ మండలంలోని పలు సమస్యలను స్థానిక రైతులు, నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో యాదగిరి నాయకులు సాయాగౌడ్, గంగాధర్, రాములుసేట్, భానుగౌడ్‌తో పాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు సమస్యలు వివరిస్తున్న రైతులు

క్లుప్తంగా

నేటి నుంచి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఆదివారం నుంచి జిల్లా మినీ-సబ్ జూనియర్ (అండర్-10) సాఫ్ట్‌బాల్ బాల, బాలికల టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం పాఠశాల ప్రిన్సిపల్ గోదావరి, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ప్రభాకర్ రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. 01-01-2013 తర్వాత జన్మించిన వారు టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు ఉదయం 7 గంటలకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లత, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనికకు రిపోర్ట్ చేయాలని సూచించారు.

ఓపెన్ తరగతులు..

నిజామాబాద్ అర్బన్: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ తరగతులు ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. రెండు, నాలుగో సెమిస్టర్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు ఉంటాయని, వివరాలకు 7382929612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్యాంపస్ హెల్త్ సెంటర్ వద్ద విద్యార్థుల ధర్నా



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ హెల్త్ సెంటర్ వద్ద విద్యార్థులు శనివారం ధర్నా నిర్వహించారు. హెల్త్ సెంటర్‌లో అత్యవసర మందులు అందుబాటులో లేవని, రాత్రి పూట వైద్యులు, సిబ్బంది ఉండటం లేదని విమర్శించారు. విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న వీసీ డి.రవీందర్, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని హెల్త్ సెంటర్ వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ.. శుక్రవారం రాత్రి 12 గంటలకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఫస్టియర్ విద్యార్థి పవన్ తీవ్రమైన చలిజ్వరంతో బాధపడగా హెల్త్ సెంటర్‌కు తీసుకు వచ్చామన్నారు. సెంటర్‌లో సిబ్బంది ఎవరూ లేరని, అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్దామని చూడగా అంబులెన్స్ మరమ్మత్తుకు గురైందని సిబ్బంది సమాధానం ఇచ్చారని వీసీతో చెప్పారు. చేసేది లేక 108కు ఫోన్ చేయగా గంట తర్వాత అంబులెన్స్ క్యాంపస్‌కు వచ్చిందని విద్యార్థులు పేర్కొన్నారు. వర్సిటీ అంబులెన్స్ అందుబాటులో ఉంటే సకాలంలోనే ఆస్పత్రికి తీసుకెళ్లే వారమన్నారు. వీసీ మాట్లాడుతూ.. ఇకపై 24 గంటలు అంబులెన్స్‌తో పాటు వైద్యసిబ్బంది, అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యారులు ఆందోళన విరమించారు.

పాఠశాల తనిఖీ

నిజాంసాగర్: దివ్యాంగులకు అందుతున్న విద్య బోధనతో పాటు ప్రత్యామ్నాయ పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు వేణుశర్మ, శ్రీపతి పరిశీలించారు. మండలంలోని ఒడ్డేపల్లి భవిత కేంద్రం, చెరువు ముందరి తండా ప్రత్యామ్నయ పాఠశాలను వారు తనిఖీ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశం, హెచ్ఎం జైల్‌సింగ్, ఐఈఆర్‌టీలు చిన్న సాయులు, సునిల్, సీఆర్పీ నర్సింలు ఉన్నారు.

అత్యవసర సేవకులు..

- ప్రాణాలు కాపాడుతున్న ఈఎంటీలు
- నేడు ఈఎంటీల దినోత్సవం

రామారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డా.. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా.. ప్రసవం కోసం వెళ్లాలన్నా వెంటనే గుర్తొచ్చేది 108 అంబులెన్స్. ఆపత్కాలంలో అంబులెన్స్ సిబ్బంది బాధితులను ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడుతున్నారు. అంబులెన్స్‌లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ), పైలెట్ (డ్రైవర్) కీలకము. 108కు కాల్ వచ్చిన క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకొని అత్యవసర సేవలు అందించి సదర్ బాధితున్ని నిమిషాల వ్యవధిలో ఆస్పత్రుల్లో చేరుస్తూ ప్రాణాలను కాపాడుతూ ప్రజల ప్రశంసలు పొందుతున్నారు. నేటు ఈఎంటీల దినోత్సవం సందర్భంగా కథనం..

ప్రాణాలకు తెగించి..

కరోనా సమయంలో అంబులెన్స్ ఈఎంటీలు, పైలెట్లు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారు. కరోనా బాధితులను ఆస్పత్రులకు తరలించి ప్రాణాలు కాపాడారు. 108కు ఎక్కువగా పురిటి నొప్పులతో బాధపడే గర్భిణుల ఫోన్స్ వస్తాయని సిబ్బంది పేర్కొంటున్నారు. ఎమర్జెన్సీ టెక్నీషియన్లు (ఈఎంటీలు) ప్రత్యేక శిక్షణ పొంది ఉంటారు. పురిటి నొప్పులు ఎక్కువ అయితే అంబులెన్స్‌లోనే ప్రసవం చేసి తల్లి బిడ్డలను సురక్షితంగా ఆస్పత్రులకు తరలిస్తారు. ఇందులో ఈఎంటీలది అత్యంత కీలకపాత్ర. రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళ్లి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు.



108లో ప్రసవం చేసిన ఈఎంటీ(ఫైల్)

కార్యాలయాలు కరువు

కామారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 13 అంబులెన్సులు అందుబాటులో ఉన్నాయి. అందులో కొన్ని ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో కూడా తెలియని పరిస్థితి. 13 అంబులెన్స్‌లలో 30 మంది ఈఎంటీలు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కనీసం కార్యాలయాలు కూడా లేవు. అంబులెన్స్‌లు పెట్టడానికి స్థలాలు లేకుండా పోతున్నాయి. పనికిరాని పాత రూములు ఉంటే 108 సిబ్బందికి కేటాయిస్తున్నారు. అందులో ఉండే మెడిసిన్ రక్షించడం ఈఎంటీలకు ఇబ్బందిగా మారింది. 108 వెహికల్ కూడా ఎండలో పెట్టడంతో అందులో ఉండే మెడిసిన్ ఇతర వైద్య పరికరాలు చెడిపోతున్నాయి. 108 జిల్లా కార్యాలయం కోఆర్డినేటర్‌కు కూడా ఒక రూమ్ ఇవ్వలేని పరిస్థితి ఉంది.

వేతన కష్టాలు

ప్రాణాలకు తెగించి బాధితులను ఆస్పత్రులకు తరలిస్తున్న ఈఎంటీలకు శ్రమకు తగ్గ ఫలితం మాత్రం నేటికీ దక్కడం లేదు. 15 ఏళ్లుగా ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్న సీనియర్లకు కూడా ఉద్యోగ భద్రత లేదు. జీతం కూడా అరకొరగా ఇస్తున్నారు ఈఎంటీలకు రూ.20 వేలు, పైలెట్లకు రూ.18 వేల వేతనం అందిస్తున్నారు. అది కూడా నెల నెల ఇవ్వడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదు. శ్రమ ఎంత పడ్డ ఎన్ని ప్రాణాలను కాపాడిన తమ ప్రాణాలకు రక్షణ లేదని ఈఎంటీలు వాపోతున్నారు. ప్రాణాలను లెక్కచేయకుండా సేవలందిస్తున్న 108 సిబ్బంది కుటుంబాలను నెట్టుకు రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



15 ఏళ్లుగా 108లో ఈఎంటీగా పనిచేస్తున్నా. ఉద్యోగ భద్రత లేదు. వేతనాలు కుటుంబ పోషణకు సరిపోవు. 108 సేఫ్టీ కోసం ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి అక్కడే వెహికల్స్ పార్క్ చేసేలాగా, సిబ్బందికి వసతి కల్పించాలి. – కృష్ణ స్వామి, 108 ఈఎంటీ

ఉష్ణోగ్రతల పెరుగుదలతో తెగుళ్లు

- రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి
- రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్త శ్రీలక్ష్మి



టమాటాలో రసం పీల్చే పురుగులు



వరిలో మెడ విరుపు తెగులు

రుద్రూర్: జిల్లాలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వచ్చే ఐదు రోజుల్లో పొడి వాతావరణం నమోదవుతుందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ వాతావరణ విభాగం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి తెలిపారు. పగటి (గరిష్ట) ఉష్ణోగ్రతలు 38.7నుంచి 40.3 డిగ్రీల సెల్సియస్, రాత్రి (కనిష్ట) ఉష్ణోగ్రతలు 23.8 నుంచి 25.1 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉండవచ్చునని వివరించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వరిలో మెడ విరుపు తెగులు తీవ్రత పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. దీని నివారణకు మాంకోజెబ్ +ట్రైసైక్లజోల్ 2.5గ్రా.(లేదా)పికాక్సిస్ట్రోబిన్+ట్రైసైక్లజోల్ 2మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. కూరగాయ పంటల్లో రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉంది. దీని నివారణకు 0.2 గ్రా.ల థయోమిథాక్సం లేదా 0.2 గ్రా.ల అసిటామిప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

నీరు పెట్టాలి

కూరగాయ, పండ్ల తోటల్లో నీటి తడులు పెట్టుకోవాలి. నీటి తడులను ఉదయం, సాయంత్రం వేళల్లో పెట్టాలి. పండ్ల తోటల్లో నేలలో ఉన్నటువంటి తేమను సంరక్షించుకోవడానికి నేలపై పంట అవశేషాలు, ఎండు గడ్డి లేదా పాలిథిన్ షీట్‌లను కప్పి ఉంచాలి. పశువులకు దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడంతో బలహీన పడకుండా కాపాడవచ్చు. కోళ్ల వేడి వాతావరణాన్ని తట్టుకోవడానికి షెడ్లలో ఫ్యాన్లను, ఫాగర్స్‌ను అమర్చి షెడ్లపై వరి గడ్డితో కప్పి స్ప్రింక్లర్లను అమర్చాలి.

హాస్టల్ సిబ్బందిపై వీసీ ఆగ్రహం

నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలోని ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌ను వీసీ డి రవీందర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్‌హాల్, విద్యార్థుల గదులను పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై వీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లల్లో ఇలాగే ఉంటారా అంటూ మండిపడ్డారు. పరిశుభ్రత పాటించాలని లేదంటే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం డైనింగ్ హాల్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. భోజనం రుచిగా వండటం లేదని, పరిశుభ్రత పాటించడం లేదని సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా తీరు మార్చుకోవడం లేదని వీసీకి ఫిర్యాదు చేశారు. ఇళ్లల్లో వంట చేసుకునే విధంగా హాస్టల్‌లో భోజనం రుచిగా వండాలని, స్టోర్ రూంలో వస్తువులను శుభ్రంగా ఉండేలా చూడాలని వీసీ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల కోరిక మేరకు హాస్టల్లో నూతన టీవీని ఏర్పాటు చేయించడంతో విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పీఆర్వో జమీల్ అహ్మద్, అసిస్టెంట్ వార్డెన్ కిరణ్‌రాథోడ్, కేర్‌టేకర్ దిగంబర్ చౌహాన్ ఉన్నారు.



మెస్ సిబ్బందిపై ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

మోదీ ప్రభుత్వంలో కనీస హక్కులు లేవు

- అదానీపై జేపీసీ విచారణ జరపాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ఖలీల్‌వాడి: మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలో విపక్షాలకు, ప్రజలకు కనీస హక్కులు లేకుండా పోయాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొని ఉన్నాయని, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సీపీఐ విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ విధానాలను ప్రశ్నిస్తే కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఈడీ, సీబీఐతో దాడులు చేయించి జైళ్లో బంధిస్తున్నారన్నారు. అదానీపై జేపీసీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి శిక్ష తప్పదన్నారు. కేసీఆర్ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. దళిత బంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం మూలంగానే జరిగిందన్నారు. సిట్, సీబీఐతో కాకుండా సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుదిరితే పొత్తు లేకుంటే సీపీఐ, సీపీఎంతో కలిసి పోటీ చేస్తాయని వెల్లడించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పశ పద్మ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమన్న, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్, కామారెడ్డి జిల్లా కార్యదర్శి దశరథ్, ఓమయ్య, రాజేశ్వర్, రాజన్న, బాబు, విఠల్ గౌడ్, దుబాస్ రాములు, బాలరాజ్, రాజమణి, స్వరూప, రాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

కోతదశలో పురుగు మందులు వాడొద్దు



ధర్పల్లి: కోత దశలో వరిలో పురుగు మందులు వాడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. పంటల నమోదు పర్యవేక్షణలో భాగంగా ఆయన మండలంలోని మైలారంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వరి పొలాలు కోత దశకు చేరుకున్నందున దొడ్డు రకాల్లో మెడ విరుపు(కొంకి రోగం) వచ్చే అవకాశం ఉందని, నీటి తడులు తక్కువ చేస్తే రోగాన్ని అరికట్టవచ్చని తెలిపారు. మెడ విరుపు రోగానికి ఎలాంటి క్రిమి సంహారక మందులు పని చేయవని చెప్పారు. ఆయన వెంట ఏవో ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

'పది'కి సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఎస్సెస్సీ పరీక్షలు
- పరీక్షలు రాయనున్న 11,899 మంది విద్యార్థులు
- జిల్లాలో 63 ఎగ్జామ్ సెంటర్ల ఏర్పాటు

కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పరీక్షలు.. ఈ నెల 13 వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో పదో తరగతి పరీక్షలను 11,899 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 63 మంది ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్‌లు, 63 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఐదుగురు రూట్ ఆఫీసర్లు, 22 మంది కస్టోడియన్స్, 22 మంది జాయింట్ కస్టోడియన్స్, 662 మంది ఇన్విజిలెటర్లను నియమించారు. అలాగే ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఒక ఏఎన్ఎం, కానిస్టేబుల్ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు తమ సందేహాల నివృత్తి కోసం కంట్రోల్ రూం(76618 54856) నంబర్‌కు ఫోన్ చేయవచ్చు.



గమనించాల్సినవి..

పాఠశాల నుంచి హాల్‌టికెట్ పొందలేని విద్యార్థులు www.bse.telangana.gov.in అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్‌టికెట్‌ను ఆర్టీసీ కండక్టర్‌కు చూపిస్తే బస్సులో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ప్రతిరోజు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలి.

పరీక్ష కేంద్రంలోకి హాల్‌టికెట్‌తో పాటు రైటింగ్ ప్యాడ్, పెన్నులు, పెన్సిల్ వంటి రాత సామగ్రిని మాత్రమే అనుమతిస్తారు. సెల్‌ఫోన్‌లు, కాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు. పరీక్ష కేంద్రానికి చుట్టు పక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది. జిరాక్స్ సెంటర్‌లను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు మూసి ఉంచాలి.

అన్ని ఏర్పాట్లు చేశాం

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. 63 పరీక్ష కేంద్రాలలో అధికారులను నియమించాం. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలి.

– ఎస్ రాజు, డీఈవో, కామారెడ్డి

యథేచ్ఛగా వన్యప్రాణుల వేట

- బోధన్‌లో పట్టుబడిన వేటగాడు
- జింక చర్మం, కొమ్ములు, నాటు తుపాకీ స్వాధీనం



నిందితుడి ఇంట్లో లభించిన జింక చర్మం, కొమ్ములు, తుపాకీ



ఫారెస్టు అధికారుల అదుపులో రియాజ్ పాషా

ఇందూరు/బోధన్: నిజామాబాద్ జిల్లాలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. జింకలు, నెమళ్లు, ఇతర వన్యప్రాణులు వేటగాళ్ల చేతిలో బలవుతున్నాయి. వాటి చర్మం, కొమ్ములు, ఇతర వస్తువులను మార్కెట్‌లో రహస్యంగా విక్రయిస్తున్నారు. శనివారం బోధన్‌లో ఫారెస్టు అధికారులు ఒక వేటగాడిని పట్టుకున్నారు. రియాజ్ పాషా అనే వ్యక్తి వన్య ప్రాణులను వేటాడుతున్నాడనే సమాచారంతో అధికారులు బోధన్‌లోని అతని ఇంటిపై దాడి నిర్వహించారు. ఇంట్లో జింక చర్మంతో పాటు కొమ్ములు, నెమలి ఈకలు, ఒక నాటు తుపాకీ లభించింది. దాడి సమయంలో రియాజ్ పాషా పరారీలో ఉన్నాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడిని బాసర ప్రాంతంలో పట్టుకుని అరెస్టు చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి బోధన్ కోర్టులో హాజరుపర్చారు. ఇందుకు కోర్టు 10 రోజుల రిమాండ్ విధించగా, జిల్లా కారాగారానికి తరలించారు. అయితే, రియాజ్ ఒక్కడే వేటకు వెళ్లాడా, మరెవరైనా ఉన్నారా అనే కోణంలో ఫారెస్టు అధికారులు ఆరా తీస్తున్నారు. కాగా, బోధన్ ప్రాంతంలోని మంజీరా నది ప్రాంతంలో కృష్ణ జింకల సంచారం ఎక్కువగా ఉంటుంది. ఇటువైపు వేటాడి జింకలను చంపుతున్నారా..? ఇతర ప్రాంతాలకు కూడా వెళ్తున్నారా..? అనే దానిపై ఫారెస్టు అధికారులు లోతుగా విచారణ చేపడుతున్నారు. సోదాలు నిర్వహించిన వారిలో ఎఫ్ఆర్వో హబీబ్, సెక్షన్ ఆఫీసర్లు చంద్ర ప్రకాశ్, బాసిద్, రాజేందర్, తదితరులున్నారు.

క్రైం కార్నర్

కుమారుడి మరణం తట్టుకోలేక ..

- తండ్రి ఆత్మహత్య
- బస్వాపూర్‌లో ఘటన

భిక్కనూరు : చేతికి అంది వచ్చిన కొడుకు కండ్ల ముందే చనిపోవడంతో ఆ బాధను తట్టుకోలేక కుమిలి కుమిలి ఓ తండ్రి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం బస్వాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చేట్కూరి ఎల్లయ్య (52), భాగవ్వ దంపతుల కుమారుడు ఎల్లేష(20) ఐదు నెలల క్రితం అకస్మత్తుగా మృతి చెందాడు. అప్పటి నుంచి ఎల్లయ్య తీవ్రమానసిక వేదనతో అనారోగ్యానికి గురయ్యాడు. శుక్రవారం తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఎల్లయ్య మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లికి చెందిన మల్లపుర్తి యాదగిరి(40) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రెండో టౌన్ ఠాణా ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. వివరాలు.. కోటగల్లికి చెందిన యాదగిరి మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతనికి 15 ఏళ్ల క్రితం వివాహం జరిగినా పిల్లలు కాలేదు. తరుచు యాదగిరి తన భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసయ్యాడు. వారం రోజుల క్రితం భార్యతో గొడవ పడగా ఆమె తల్లిగారి ఇంటికి వెళ్లింది. దీంతో యాదగిరి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పెద్ద పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని బురుడుగల్లీకి చెందిన మామిడోళ్ల శ్రీకాంత్(30) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. వివరాలు.. శ్రీకాంత్ కూలీ పని చేస్తూ జీవించేవాడు. వచ్చిన డబ్బులతో మద్యం తాగేవాడు. అంతేగాకుండా మద్యం కోసం అప్పులు చేశాడు. దీంతో అప్పులు ఎలా తీర్చాలని మనోవేదనతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

రెండు మొరం టిప్పర్ల పట్టివేత

నవీపేట: మండలంలోని అభంగపట్నం శివారులో మొరంతో వెళ్తున్న రెండు టిప్పర్లను శనివారం పట్టుకున్నట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. అభంగపట్నం గుట్టలో అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదు రావడంతో దాడి చేసి, టిప్పర్లను సీజ్ చేశామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ప్రమాదవశాత్తు పలువురు మృతి చెందారు. స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి బాలుడు, చికిత్స పొందుతూ యువకుడు, రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృత్యువాత పడ్డారు. కాలువలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది.

స్విమ్మింగ్ పూల్‌లో మునిగి బాలుడు..



షేహబాజ్ (ఫైల్)

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని నాగారం ఏరియాలో గల స్విమ్మింగ్ పూల్‌లో మునిగి శాంతినగర్‌కు చెందిన షేహబాజ్ (16) మృతి చెందాడు. శనివారం మరో ఇద్దరితో కలిసి వెళ్లిన షేహబాజ్ స్విమ్మింగ్ చేస్తుండగా ఒక్కసారిగా నోటిలోకి నీరు పోవడంతో శ్వాస తీసుకోవడం కష్టమైంది. నీటిలో మునిగిపోతుంటే గమనించిన స్నేహితులు స్విమ్మింగ్ పూల్ నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇస్మాయిల్ ఖురేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయినాథ్ తెలిపారు.

దాబాపై నుంచి పడిన యువకుడు..

మాచారెడ్డి: మండలంలోని ఆరెపల్లి గ్రామంలో దాబాపై నుంచి పడి చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తాడూరు మహిపాల్ (31) గత నెల 26న రాత్రి దాబాపై పడుకున్నాడు. నిద్రమత్తులో కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మహిపాల్ కుటుంబానికి డీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు.

రైలు కిందపడి ఒకరు..

నవీపేట: నవీపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మహబూబ్ శనివారం తెలిపారు. మహారాష్ట్రలోని రోటెగావ్ నుంచి కాచిగూడకు వెళ్తున్న రైలు కింద పడి మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటాయని, అతని దగ్గర జోలె, పళ్లెం ఉండడంతో యాచకునిగా గుర్తించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

గల్లంతైన బాలుడు..

నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన బాలుడు సాత్విక్(8) మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మాక్లూర్ మండలం బొంకన్‌పల్లికి చెందిన సరోజ–గంగారం దంపతులకు కుమారుడు సాత్విక్ ఉన్నాడు. సరోజ తండ్రి ఇప్పిర్గా సాయిలు ఇటీవల చనిపోయాడు. దీంతో ఆలయంలో పూజలు చేయడానికి సరోజ కుటుంబంతో కలిసి బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో తండ్రి గంగారంతో కలిసి స్నానానికి వెళ్లిన బాలుడు సాత్విక్ శుక్రవారం నిజాంసాగర్‌లో కాలువలో కొట్టుకుపోయాడు. గంగారాంకు ఈత రాకపోవడంతో కళ్ల ముందే కొట్టుకుపోతున్న కుమారుడిని కాపాడలేకపోయాడు. శనివారం నస్రుల్లాబాద్ గ్రామ శివారులో బాలుడి మృతదేహం లభ్యమైంది. తాత చనిపోవడంతో ఆలయంలో పూజలు చేయడానికి తల్లిదండ్రులతో వచ్చిన బాలుడు మరనించడంతో కుటుంబ సభ్యులను కన్నీరు మున్నీరుగా విలపించారు.

ఆకలి తాళలేక మృత్యువాత

రుద్రూర్: కోటగిరి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఆకలి తాళలేక శనివారం మృతి చెందినట్లు ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆకలితో అలమటిస్తూ.. అనారోగ్యానికి గురై చనిపోయినట్లు ఆయన చెప్పారు. మృతుడికి 55 ఏళ్లు ఉంటాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

భిక్కనూరు: మండలంలోని లక్ష్మీనగర్ తండాకు చెందిన ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ శనివారం తెలిపారు. మెదక్ జిల్లా ఇస్లానాయక్‌తండాకు చెందిన రాథుల విఠల్ – లక్ష్మిల కుమార్తె కళావతి (28)కి లక్ష్మీనగర్ తండాకు చెందిన భానోత్ పాండుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. మార్చి 30న అత్త జీజీబాయి, భర్త, భర్త సోదరి యశోద తనను కొట్టారని కళావతి ఆమె మేనత్తకు తెలిపింది. ఈ క్రమంలో శనివారం వేకువజామున కళావతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె తల్లిదండ్రులకు స్థానికులు ఫోన్ చేశారు. తమ కూతురు మృతికి ఆమె భర్త పాండు, అత్త బీజీబాయి, ఆడపడుచు యశోద కారణమని వీరిపై చర్యలు తీసుకోవాలని కళావతి తండ్రి విఠల్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.